రంభించింది. మేం అంతా మర్చిపోయాం. మాకు కాలం గుర్తులేదు. స్థలం గుర్తులేదు. వాస్తవం గుర్తులేదు. మృత్యువు గుర్తులేదు. అన్నీ మర్చిపోయాం. ఆ పియానో చుట్టూ కూర్చున్న మేము ఎంతోకాలం తర్వాత కలుసుకున్న ఆత్మీయుల్లా సంతోషంగా మారిపోయాం.

ఫ్లోరీ పాట ముగించగానే చీకటికీనీడల్లోంచి అర్వైన్ గొంతు మళ్ళీ వినిపించింది.

"అదిగో ఆమె కనిపిస్తోంది. ఇక్కడే వుంది. మనతోనే వుంది. మళ్ళీ ప్రారంభించు ఫ్లోరీ. షుమన్ కృతి 'పాపిలాన్స్' వినిపించు. ఆ కృతి నువ్వెంత బాగా వినిపించగలవో ఆమె కూడా అంత బాగా వినిపించగలదు తెలుసా? కాదనకు ఫ్లోరీ. షుమన్ జర్మనీ జాతి వాడని నాకు చెప్పొద్దు. ఆయన నిజంగా పరిపూర్ణ సంగీతకారుడు. నేనా కృతి మళ్ళీ వినాలి. మా వూళ్ళో ఆనాటి ఆ వేసవి సాయంకాలం విన్నట్టుగానే మళ్ళీ వినాలి. వద్దు, నేను చావనని నాతో చెప్పొద్దు. నేను బ్రతకనని నాకు తెలుసు. మృత్యువును నేనిప్పుడు అనుభవించగలుగుతున్నాను. నాతో ఇంకేమీ చెప్పొద్దు. ప్రారంభించు."

**వేదనా భరితమైన ఆ నిశ్శబ్దంలో, బాధాకరమైన ఆ గదిలో చిత్రాతిచిత్రంగా క్రూరాతిక్రూరమైన సంగీత సభ ప్రారంభమైంది. కేవలం ఊహించుకోవలసిందే ఆ క్రౌర్యం.**

ఫ్లోరీ వణికిపోతూ 'పాపిలాన్స్' వినిపించనారంభించాడు. ఆ అమరకృతిలో విరామం వచ్చినప్పుడల్లా మేం అర్వైన్ వైపు తిరిగి తిరిగి చూస్తున్నాం. నెమ్మదిగా అతను అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. ఆ స్థితిలోనే అతను చిన్నగా కలవరించడం మాకు వినిపించింది.

"థ్యాంక్స్ ఫేనీ థ్యాంక్స్."

అతని చిత్తభ్రాంతి నా మీద ఎంత తీవ్రంగా పనిచేసిందంటే ఆ సమయంలో బంగారుకురులతో ఓ తెల్లని యువతి వాస్తవంగా ఆ గదిలో తిరుగుతున్నట్టే నాకనిపించింది. నేనింకా ఆ భ్రమలోనే వున్నాను. అంతలో పక్కమీదికి వంగి అర్వైన్‌ని పరీక్షగా చూస్తున్న మేజరు చప్పున వెనక్కి తిరిగి ఫ్లోరీ భుజం మీద చెయ్యి వేశాడు. ఫ్లోరీ

**అతని చిత్తభ్రాంతి నామీద ఎంత తీవ్రంగా పనిచేసిందంటే ఆ సమయంలో బంగారు కురులతో ఓ తెల్లని యువతి వాస్తవంగా ఆగదిలో తిరుగుతున్నట్టే నాకనిపించింది.**

ఇంకా పియానో వాయిస్తూనే వున్నాడు. మేజర్ గద్గదస్వరంతో అన్నాడు:

"ఆపు. తనింక వినలేడు."

ఆ అద్భుతమైన సంగీతఝరి ఒక్కసారిగా ఆగిపోయింది. బాధాకరమైన నిశ్శబ్దం నలువైపులా అలుముకుంది. ఫ్లోరీ పియానో మెట్లమీద మోచేతులానించాడు. దుఃఖం వల్ల కొంత, సంగీతం వల్ల కొంత, నిద్రలేమి వల్ల కొంత వివశుడైపోయి అతను ఏడ్చేశాడు.

రెండో యుద్ధంకథ

# బెర్లిన్‌లో

ఇంగ్లీషు మూలం:
**మేరీ బాయిల్ ఓ' రైలీ**

అనువాదం:
**దాదాహయాత్**




బెర్లిన్ నగరం వెలుపలికి పాక్కుంటూ వెళ్తున్న ఆ రైలు ఆడవాళ్ళతో పిల్లలతో నిండిపోయింది. జవసత్వాలున్న మగవాడు ఒక్కడూ అందులో లేడు. ఓ కంపార్ట్‌మెంటులో జబ్బుపడ్డట్టు బలహీనంగా కనిపిస్తున్న ఓ పెద్దావిడ పక్కనే తల నెరిసిన ఓ ముసలి సైనికుడు కూర్చున్నాడు. ఘుకు బుకు ఘుకు బుకు శబ్దాల మధ్య ఆ పెద్దావిడ ఏవో ఊహల్లో పడిపోయి, "ఒకటి, రెండు, మూడు," అని లెక్కపెడుతుండడం ప్రయాణీకులందరూ వింటున్నారు. ఆగి ఆగి ఆవిడ అవే మాటలు గబగబా మళ్ళీ మళ్ళీ పలుకుతోంది. ఇద్దరమ్మాయిలు ఆవిడ వింత ప్రవర్తన చూసి అనుచితమైన వ్యాఖ్యానాలు చేసి అనాలోచితంగా నవ్వారు. ఓ పెద్దాయన మందలించాడు. నిశ్శబ్దం అలుముకుంది.

"ఒకటి, రెండు, మూడు," వేటిగురించి స్పృహలేని పెద్దావిడ మళ్ళీ లెక్కపెట్టింది. ఆ ఇద్దరమ్మాయిలు మళ్ళీ మూర్ఖంగా నవ్వారు. తల నెరిసిన ముసలి సైనికుడు ముందుకు వంగాడు.

"ఫ్రాలీన్," గంభీరంగా అన్నాడతను. "ఈ అభాగ్యురాలు నా భార్య అని చెబితేనైనా మీరు నవ్వడం ఆపుతారనుకుంటాను. మేమిప్పుడే మా ముగ్గురు కొడుకుల్ని యుద్ధంలో పోగొట్టుకున్నాం. యుద్ధం జరుగుతున్న ఫ్రంటుకు ఇక నేను వెళ్ళేముందు తనని పిచ్చాసుపత్రిలో చేర్పించాలి."

కంపార్టుమెంటులో భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది.